వైభవంగా సుదర్శన నారసింహ హోమం

యాదగిరిగుట్ట, జూలై 18 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో సుదర్శన నారసింహ హోమం అత్యంత వైభవంగా జరిగింది. గురువారం ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతు జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు కొనసాగాయి.

యాదగిరిగుట్టను అద్భుతంగా తీర్చిదిద్దారు : సినీ నటుడు తనికెళ్ల

యాదగిరిగుట్టలో కుటుంబ సభ్యులతో సినీ నటుడు తనికెళ్ల భరణి

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని సినీ నటుడు తనికెళ్ల భరణి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. గురువారం యాదగిరి కొండకు చేరుకున్న ఆయన స్వయంభూ పంచ నారసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ తన సతీమణి జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు 15 సార్లు గుట్టకు వచ్చానన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి యాదగిరిగుట్టను వైభవంగా తీర్చిదిద్దారని, తిరుపతి తరహాలో స్వామివారి క్షేత్రం అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. ఆలయ శిల్పాలు, పూజా విధానాలను చూస్తే కలియుగ వైకుంఠంలా అనిపిస్తోందని కితాబునిచ్చారు.

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

అడ్డగూడూరు : కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు

అడ్డగూడూరు, జూలై 18 : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి 59వ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, మాజీ ఎంపీటీసీ జనార్దన్‌రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్, నర్సిరెడ్డి, బాబు మహాజన్, రవి, నరేశ్, కిరణ్, మత్స్యగిరి, కృష్ణ, అయోధ్య, రామకృష్ణ, నర్సయ్య పాల్గొన్నారు.

మోత్కూరు : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మున్సిపాలిటీ కేంద్రంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్ కేక్ కట్ చేశారు. కార్యకర్తలకు స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, యాకూబ్‌రెడ్డి, శ్రీను, మల్లేశ్, నాగయ్య, అనిత, శైలజ, జ్యోతి, పిచ్చయ్య, తిరుమలేశ్, మత్స్యగిరి, సాగర్ పాల్గొన్నారు.

కక్కిరేణిలో సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

కక్కిరేణిలో గుంతల రోడ్డుపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రామన్నపేట, జూలై 18 : మండలంలోని కక్కిరేణి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం డిమాండ్ చేశారు. సీపీఎం పోరుబాటలో భాగంగా మండలంలోని కక్కిరేణి గ్రామంలో గురువారం పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్కిరేణి నుంచి రామన్నపేట, మాండ్ర, పిల్లిగూడెం, అక్కెనపల్లి, ఎన్నారం గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కక్కిరేణి – రామన్నపేట బీటీ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

కార్యక్రమంలో సీపీఎం నాయకులు వేముల సైదులు, కన్నెబోయిన యాదయ్య, శివకుమార్, సురేశ్, పూలమ్మ, మహేందర్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

అంబులెన్స్‌లో శిశువుతో 108 సిబ్బంది

అడ్డగూడూరు, జూలై 18 : మండలంలోని మానాయికుంట గ్రామంలో గురువారం ఓ మహిళ 108 అంబులెన్స్‌లో దవాఖానకు తీసుకెళ్తుండగా.. ప్రసవించింది. మానాయికుంట గ్రామానికి చెందిన మెరుగు మానస మొదటి కాన్పు కోసం 108 వాహనంలో సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే పండంటి పాపకు జన్మనిచ్చినట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చేర్పించినట్లు పైలట్ సోమేశ్వర్, ఈఎంటీ రంజిత్ తెలిపారు.

ఆలేరు బాలుర జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు యోగా నేర్పిస్తున్న వెంకటరాజయ్య

విద్యార్థులకు యోగా శిక్షణ

ఆలేరురూరల్, జూలై 18 : స్థానిక బాలుర జడ్పీహెచ్ఎస్‌లో ఆచార్య వెంకటరాజయ్య ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం

• ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

రుణమాఫీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

తుర్కపల్లి, జూలై 18 : రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఏక కాలంలో రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకున్నదని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన రుణమాఫీ సంబురాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన చౌరస్తా నుంచి రైతు వేదిక వరకు ర్యాలీగా వెళ్లి సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫ్లెక్సీకి రైతులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ మొదటి విడుత 12లక్షల మంది రైతులకు లక్ష లోపు రుణాలు రూ.7వేల కోట్లు మాఫీ చేసినట్లు తెలిపారు. అగస్టు15 లోపు రూ.2లక్షల రుణాన్ని మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అన్నం సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, మండల ప్రత్యేకాధికారి సురేశ్, ఏడీఏ పద్మావతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాం సుందర్, తాసీల్దార్ దేశియా, ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి, ఏఓ దుర్గేశ్వరి, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రుణమాఫీపై రైతుల సంబురాలు

భువనగిరి కలెక్టరేట్ : సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

యాదగిరిగుట్ట/ భువనగిరి కలెక్టరేట్/ ఆలేరు రూరల్/ భూదాన్ పోచంపల్లి/ రాజాపేట/ ఆత్మకూరు(ఎం)/ మోటకొండూర్/ సంస్థాన్ నారాయణపురం/ రామన్నపేట/ చౌటుప్పల్ రూరల్/ మోత్కూరు/ బీబీనగర్, జూలై 18 : రైతు రుణమాఫీ ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లాలోని పలు రైతు వేదికల్లో గురువారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని రైతులు వీక్షించారు. కాంగ్రెస్ నాయకులు పలుచోట్ల ర్యాలీలు నిర్వహించి సంబురాలు జరుపుకొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. యాదగిరిగుట్ట మండలంలోని మాసాయిపేట రైతువేదికలో, భువనగిరి మండలం అనాజీపురం, ఆలేరు మండలం కొలనుపాక, రామన్నపేట మండల కేంద్రంలో, మోటకొండూర్ మండలం చాడ, మోత్కూరు మండలం పాటిమట్ల, చౌటుప్పల్ మండల కుంట్ల గూడెం, బీబీనగర్ మండలం రాయరావుపేట, ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌ను అధికారులు, రైతులు వీక్షించారు. మొదటి విడుతగా ఆలేరు మండలంలో 1,878 మంది రైతులకు రుణమాఫీ అయినట్లు ఏఓ దీప్తి తెలిపారు. భూదాన్ పోచంపల్లి మండలంలో 2,286, బీబీనగర్ మండలంలో 1,650, గుండాల మండలంలో 2,223, మోత్కూరు మండలంలో 1.357 మంది రైతులకు రుణమాఫీ అయ్యింది. సంస్థాన్ నారాయణపురం మండలంలో 3,008 మంది రైతులకు రుణ మాఫీ అయినట్లు ఏఓ ఉమారాణి తెలిపారు.

ఆర్థిక సమస్యతో చదువుకు దూరం కాకూడదు : వెంకటేశ్

విద్యార్థులకు నగదు అందజేస్తున్న దాతలు

భువనగిరి కలెక్టరేట్, జూలై 18 : గ్రామీణ విద్యార్థులు ఆర్థిక సమస్యతో చదువుకు దూరం కాకూడదని సామాజిక కార్యకర్త కొడారి వెంకటేశ్ అన్నారు. భువనగిరి మండలం బస్వాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో మెరిట్ విద్యార్థులకు మాజీ సర్పంచ్ బెజ్జంకి వెంకట నర్సింహారెడ్డి జ్ఞాపకార్థం వారసులు నరోత్తంరెడ్డి, మాణిక్‌రెడ్డి, సామ సుష్మ, కోమటిరెడ్డి స్వప్న అందించిన రూ.50వేల నగదును నలుగురు విద్యార్థులకు గురువారం ఆయన అందజేసి మాట్లాడారు. పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందించి, విద్యార్థులను ప్రోత్సహిస్తున్న దాతలకు ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం దాతలను సన్మానించారు. పాఠశాల హెచ్ఎం డి.కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ కొండమడుగు బాలమణి, రుచిక, వికలాంగుల హక్కుల సాధన నాయకులు మచ్చ ఉపేందర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ ప్రారంభం

మహబూబ్‌పేటలో వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు కణ్ణన్

యాదగిరిగుట్ట, జూలై 18 : హైదరాబాద్ అమీర్‌పేటకు చెందిన రోటరీ క్లబ్ రూ.2 లక్షలతో ఆర్ఓఆర్ వాటర్ ఫిల్టర్‌ను మండలంలోని మహబూబ్‌పేట గ్రామంలో ఏర్పాటు చేశారు. గురువారం రోటరీ క్లబ్ అధ్యక్షుడు కె.కణ్ణన్ ఫిల్టర్‌ను ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛమైన తాగు నీటిని ఉచితంగా అందించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆరె స్వరూపామల్లేశ్‌గౌడ్, రోటరీ క్లబ్ కార్యదర్శి సీవీ రెడ్డి, ప్రాజెక్ట్ డైరక్టర్ జగదీప్ సింగ్ సైనీ, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రావు, డైరెక్టర్లు కిశోర్, దుర్గాప్రసాద్, బాలరాజుగౌడ్, సభ్యులు కన్నయ్య కుమార్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

నేతాజీ సంఘం సభ్యుడికి సరుకులు అందజేత

భూదాన్‌పోచంపల్లి, జూలై 18 : పట్టణంలో నేతాజీ యువజన సంఘం సభ్యుడు గునిగంటి పాండు ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో ఆ సంఘం ఆధ్వర్యంలో నెలకు సరిపడా కిరాణా సామాన్‌ను గురువారం అతడి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బొడిగె లింగంగౌడ్, ప్రతినిధులు గంజి రామదాస్, డబ్బీకార్ సాహేశ్, ఏలె హరిశంకర్, శెట్టి శ్రీనివాస్, కట్కూరి పాండు, కుడికాల రామ్‌నర్సింహ, వంగూరి పాండు, మాటూరి సుధాకర్, కీర్తి సంజీవ, తండ రమేశ్, గునిగంటి వెంకటేశం, బొడిగె బాబు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

ఆలేరు రూరల్, జూలై 18 : మండలంలోని వివిధ పాఠశాలల్లో గురువారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. పీఆర్‌టీయూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బూషపాక రాములు, జిల్లా గౌరవాధ్యక్షుడు మంద సోమరాజు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

భూదాన్ పోచంపల్లి, జూలై 18 : మండలంలోని వంకమామిడి గ్రామానికి చెందిన గాలి కుమార్ ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల పక్షవాతం రావడంతో పంచానికే పరిమితమయ్యాడు. మండల ఎలక్ట్రీషియన్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థిక సాయాన్ని గురువారం కుమార్‌కు అందించారు. సంఘం అధ్యక్షుడు రాసూరి సత్యనారాయణ, గౌరవాధ్యక్షులు పున్న గణేశ్, రాము, ఉపాధ్యక్షుడు దాసరి శ్రీను, ప్రధాన కార్యదర్శి ఎరవ విఘ్నేశ్వర్, సహాయ కార్యదర్శి వినోద్, సభ్యులు బాలకృష్ణ, దత్తు, మహేశ్, హరి, రామకృష్ణ, నరసింహ, సురేశ్ పాల్గొన్నారు.

రఘునాథపురంలో..

రాజాపేట, జూలై 18 : మండలంలోని రఘునాథపురం గ్రామానికి చెందిన గంధమల్ల నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ బుడిగె రేణుకాపెంటయ్యగౌడ్ గురువారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో చల్లూరు పోషయ్య, బాను సంపత్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

• మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహేంద్రనాథ్

అడ్డగూడూరు, జూలై 18 : రుణమాఫీ పేరుతో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహేంద్రనాథ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు ద్వారా జూన్ నెల రాకముందే ఎకరాకు రూ.5వేల చొప్పున సంవత్సరానికి 15వేల కోట్ల రూపాయలను రైతుల అకౌంట్లలో వేస్తుండేదని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎకరాకు పంటకు రూ.7500 ఇస్తామని హామీ ఇచ్చి పాత రూ.5వేలు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. లక్ష రూపాయల రుణమాఫీకి రాష్ట్ర వ్యాప్తంగా 36 లక్షల మంది రైతులు అర్హులు ఉండగా.. 11.50 లక్షల మందికి మాత్రమే మాఫీ చేశారని తెలిపారు. మరో 25 లక్షల మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు. 24 గంటల విద్యుత్ ఇవ్వడం లేదని, రాబోయే రోజుల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

జన సైనికులకు పార్టీ అండగా ఉంటుంది

• జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగబాబు

చంద్రశేఖర్ కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న నాగబాబు, శివారెడ్డి

చౌటుప్పల్ రూరల్, జులై 18 : జనసేన కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొణిదల నాగబాబు అన్నారు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన జనసేన పార్టీ సభ్యుడు సంగం చంద్రశేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పార్టీ సభ్యుడు కావడంతో మృతుడి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల బీమా డబ్బులను హైదరాబాద్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం అందజేశారు. కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ నాయకులు పర్నె శివారెడ్డి, వేమూరి శంకర్, రాధా రాజలింగం, గోకుల రవీందర్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ టీఎస్ మోటకొండూరు గ్రామ కమిటీ

మోటకొండూర్, జూలై 18 : మండల కేంద్రంలో గురువారం జరిగిన ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా సదస్సులో మోటకొండూర్ గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామానికి చెందిన కొండమడుగు వీరనర్సింహ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయనకు ఎమ్మార్పీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు బొట్ల మంగపతి, కొల్లూరు మైసయ్య, కొల్లూరు మొగులయ్య నియామకపత్రం అందించారు. జిల్లా నాయకులు కొల్లూరు హరిబాబు, వంగపల్లి సాయి, కొల్లూరి రాజు, బొట్ల రమేశ్, బొట్ల నవీన్, కొల్లూరి రంజిత్, నరేశ్, రాజు పాల్గొన్నారు.

అమ్మ మాట - అంగన్‌వాడీ బాట ర్యాలీలు

రాజాపేట : కుర్రారంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ విద్యార్థులు

భూదాన్ పోచంపల్లి, జూలై 18 : పట్టణంలోని రాంనగర్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో 'అమ్మ మాట – అంగన్‌వాడీ బాట'లో భాగంగా గురువారం ర్యాలీ తీశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ టీచర్ డి. శివరాణి, ఆయ బి. సంతోష, చిన్నారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని కుర్రారంలో అంగన్‌వాడీ టీచర్ స్వప్న ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కోటిరెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సౌజన్య, ఆయా మౌనిక, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పల్లెర్లలో అక్షరాభ్యాసం

ఆత్మకూరు(ఎం) : మండలంలోని పల్లెర్ల గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ జ్యోత్స్న, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, టీచర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

వలిగొండలో ఎడ్ల బండిపై ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

రైతుల బంగారు భవిష్యత్ కోసమే రుణమాఫీ

• భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

రామన్నపేట (వలిగొండ), జూలై 18 : రైతుల బంగారు భవిష్యత్ కోసమే ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేసిన సందర్భంగా వలిగొండ మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో రైతులు గురువారం నిర్వహించిన ర్యాలీ, సంబురాల్లో ఆయన పాల్గొని సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, ఆగస్టు 15 వరకు రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని తెలిపారు. మండలంలోని బునాదిగాని, ధర్మారెడ్డిపల్లి కాల్వ పనులు చేపట్టి సాగు నీరందించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని కలెక్టర్ హనుమంతు కె.జెండగే, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి వీక్షించారు. డీఏఓ అనూరాధ, ఏడీఏ దేవ్‌సింగ్, మండల ప్రత్యేకాధికారి జగన్నాథరావు, మాజీ ఎంపీపీ నూతి రమేశ్, మాజీ జడ్పీటీసీ పద్మా అనంతరెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతులను రుణ విముక్తుల్ని చేయడమే ప్రభుత్వ లక్ష్యం

• ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్లన్న

బొమ్మలరామారం, జూలై 18 : రాష్ట్రంలోని రైతులందరినీ రుణ విముక్తుల్ని చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణ మాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని ఆయన వీక్షించి సంబురాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గూదె బాల నర్సింహ, ఏడీఏ పద్మావతి, ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, మల్యాల స్పెషల్ ఆఫీసర్ సునీత, ఏఓ పద్మ, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

పోలీస్ బెటాలియన్‌కు మా భూములు కేటాయించొద్దు

తాసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న భూ బాధితులు

సంస్థాన్ నారాయణపురం, జూలై 18 : మండల కేంద్రంలోని సర్వే నెం. 255లో ఉన్న తమ భూములను పోలీస్ బెటాలియన్‌కు కేటాయించవద్దని భూ బాధితులు, అఖిలపక్ష నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం తాసీల్దార్ కార్యలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ 70 సంవత్సరాలుగా 130 కుటుంబాలకు చెందిన పేదలం 255 సర్వే నెంబర్ భూమిలో సాగు చేసుకుంటున్నామని తెలిపారు. గత ప్రభుత్వం కొందరు రైతులకు పట్టాలు ఇచ్చిందని, మరి కొందరికి ఇవ్వలేదని అన్నారు. రైతులు సాగు చేసుకుంటున్న భూములను పోలీస్ బెటాలియన్‌కు కేటాయించడానికి అధికారులు నివేదిక సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. తమ భూములను పోలీస్ బెటాలియన్‌కు కేటాయిస్తే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తెలంగాణ భిక్షం, శ్రీనివాస్, నర్రి నరసింహ, ఎడ్ల సత్తయ్య, దుబ్బాక భాస్కర్, బొడ్డుపల్లి గాలయ్య, చిలువేరు అంజయ్య పాల్గొన్నారు.

అర్బన్ కాలనీ రైల్వే డ్రైనేజీ డిజైన్ మార్చాలి : డీవైఎఫ్ఐ

అర్బన్ కాలనీ డ్రైనేజీ వద్ద నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

భువనగిరి అర్బన్, జూలై 18 : పట్టణంలోని అర్బన్ కాలనీకి వాహనాలు వెళ్లేందుకు రైల్వే అండర్ పాస్ బ్రిడ్జీ వద్ద నిర్మిస్తున్న డ్రైనేజీ కాల్వ నిర్మాణ డిజైన్ మార్చి భవిష్యత్‌లో ఉపయోగ పడేలా నిర్మించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్ కోరారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం మోరీ నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. కాలనీ ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది జరుగకుండా నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రియాజ్, తరుణ్, సాజిద్, విక్రం, పవన్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భువనగిరి అర్బన్, జూలై 18 : విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు దాటినా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ ఇంకా అందలేదని, వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతల శివ, పట్టణాధ్యక్షుడు ఈర్ల రాహుల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గంజ్ హైస్కూల్ విద్యార్థులను గురువారం కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు పుస్తకాలు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే డీఈఓ, కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షుడు ఈర్ల కార్తీక్, నాయకులు కరట్లపల్లి భవానీ శంకర్, మహేశ్, సతీశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి : మాధవరెడ్డి

మాట్లాడుతున్న ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

భూదాన్ పోచంపల్లి, జూలై 18 : ఫొటో, వీడియోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భీమిడి మాధవరెడ్డి అన్నారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 50 ఏండ్లు నిండిన ఫొటోగ్రాఫర్లకు పింఛన్, బీమా పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. షరతులు లేకుండా ముద్ర రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భోగ చంద్రశేఖర్, మండలాధ్యక్షుడు దోర్నాల గణేశ్, ఉపాధ్యక్షుడు సీత శ్రవణ్, కేమ విష్ణుమూర్తి, మక్తాల కృష్ణ, మాచర్ల కృష్ణానంద, రవ్వ నవీన్, దోర్నాల మధుసూదన్, చెరుపల్లి గణేశ్, సిద్ధేశ్వర్, స్వామి, శేఖర్ పాల్గొన్నారు.